ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025
5
కర్నూలు

మాట్లాడుతున్న జస్టిస్ లీలా వెంకట శేషాద్రి

అనాథల పిల్లలకూ ఆధార్ కార్డులు

- జస్టిల్ లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

జిల్లాలో దిక్కులేని అనాథ పిల్లను గుర్తించి ఆధార్ కార్డులు ఇవ్వాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ బి.లీలావెంకట శేషాద్రి తెలిపారు. జాతీయ , రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆదేశాలతో జస్టిస్ బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం కర్నూలు జిల్లా న్యాయ సేవాసదన్‌లో గవర్నమెంట్ లైన్ డిపార్ట్‌మెంట్లతో ఏర్పాటు చేసిన సాథి కమిటీతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న దిక్కులేని, అనాథ పిల్లలను గుర్తించడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సాథి కమిటీ ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి 125 మంది ఆధార్ కార్డ్స్ లేని పిల్లలను గుర్తించామని జడ్జి తెలిపారు. వారందరికి ఈ నెల 26 తరువాత నుంచి ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసి లైన్ డిపార్టుమెంట్ల సహకారంతో ఆధార్ కార్డ్స్ ఇప్పిస్తామన్నారు. ఈ కమిటీ దిక్కులేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డులను ఇప్పించడంతో పాటు వివిధ గవర్నమెంట్ పథకాలతో వారిని అనుసంధానం చేసి వారికి విద్య , గవర్నమెంట్ పథకాలన్నీ వర్తింప చేసేలా కషి చేస్తాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క అనాథ, దిక్కులేని పిల్లలకు ఆధార్ కార్డులు కలిగి ఉండేలా ఈ డిపార్ట్మెంట్లన్నీ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఎవరికైనా అనాథ పిల్లలు కనిపించిన 15100 టోల్ ఫ్రీనెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఐసిడిఎస్ కర్నూలు , నంద్యాల పిడినిర్మల, లీలావతి, నంద్యాల అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారదబాయి, కర్నూలు తహసీల్దార్ ఇంద్రాణి, ప్యానల్ లాయర్ వెంకటేశ్వర్లు, ప్యారా లీగల్ వాలెంటీర్స్ రాయపాటి శ్రీనివాసులు, సుధారాణి, హేమంత్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటాం

- 49వ రోజుకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె - కుటుంబ సభ్యులతో కలెక్టరేట వరకు ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వ ఉద్యోగులని ఆన్‌లైన్‌లో చూపిస్తూ సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఉండడం చేత తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాలో పడలేదని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే భార్యా పిల్లలతో సహా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి సమీర్ బాష చెప్పారు. మంగళవారం మున్సిపల్ ఇంజనీర్ కాంట్రాక్టు కార్మికులు జీతాల పెంపుదల సమ్మె 49వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది అని కూటమి ప్రభుత్వం కార్మికులు , ప్రజల విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తల్లికి వందనం పడని పిల్లలు , తల్లిదండ్రులతో సహా మున్సిపల్ ఆఫీస్ దగ్గర నుండి కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ ఎన్‌టిఆర్ విగ్రహానికి వినతి పత్రం అందించి తమ న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనియెడల భార్యా పిల్లలతో సహా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటా మని రాష్ట్ర కోశాధికారి సుమీర్‌బాష, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగశేషులు, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరితోపాటు భార్య పిల్లలు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. మాకిచ్చే కొద్దిపాటి ఒప్పంద జీతాలకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తించడం లేదని అన్నారు. మా పిల్లల చదువు, ఇంటి అద్దెలు, పెరుగుతున్న నిత్యవరాల ధరలు ఎలా భరించాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని తెలిపారు. ఈ ర్యాలీలో నగరపాలక పంప్ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులు, వీధి దీపాల కార్మికులు, పార్కులు, డివైడర్లలో పనిచేసే కార్మికులు వారి తల్లిదండ్రులు పిల్లలతో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మా నాన్నలకు జీతాలు పెంచండి.. మేమేం పాపం చేశామని తల్లికి వందనం ఇవ్వలేదు. అని చిన్నారుల ఫ్లకార్డుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ఏడాది పాలన వేడుకల్లో ఎంపీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాదైన సందర్భంగా జిల్లాలోని పలు చోట్ల టిడిపి నాయకులు, అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎంపి నాగరాజు కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల వారు ఆధరించడంతోనే తాను ఎంపీగా గెలుపొందానని, తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎప్పటికీ రుణ పడి ఉంటానన్నారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- 30న భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ నల్లా చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న సాయంత్రం 5 గంటలకు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, దాన్ని జయప్రదం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా సయ్యద్ జాకీర్ అహ్మద్ రషీది పిలుపునిచ్చారు. ఈ సభ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు, సేవ్ వక్ఫ్-సేవ్ కాన్సిటెన్సీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని కన్వీనర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎస్ టి బి సి కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్, కో కన్వీనర్లు ఎంఎ హమీద్, ఎస్ఎండి.షరీఫ్‌లు మాట్లాడారు. 30న బహిరంగ సభకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని ,ఇది మన మనుగడకే ప్రశ్నార్థకమన్నారు. రాబోయే కాలంలో మసీదులు, మదరసాలు ,కబరస్తాన్లు ఇవి ఏమి ఉండకుండా లాక్కోవాలని, దుర్మార్గమైన వైఖరి చాలా స్పష్టంగా కనబడతుందన్నారు. దీనిని ముక్త కంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ఈ బహిరంగ సభకు అందరినీ ఆహ్వానిస్తున్నామని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ, మహిళలు, హిందూ సోదరులు ,రాజ్యాంగా పరిరక్షకులు ,న్యాయ కోవిదులు ,మేధావులు అన్ని రకాల వాళ్ళు హాజరవుతారన్నారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేసినా ప్రజలు ఇప్పటివరకు భారీ ఎత్తున కలిసి వచ్చి తమ సంఘీభావం తెలిపారని, అందుకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఈనెల 30న సోమవారం సాయంత్రం 5 గంటలకు ఎస్‌టిబిసి కళాశాల మైదానానికి ప్రజానీకం అందరు కూడా చేరుకోవాలని ఈ సభను కూడా అదే ఉత్సాహంతో, కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి, ఈ నల్ల చట్టాన్ని రద్దు చేసేదాకా పోరాటాలకు తమ సహకారం ,సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అబ్దుల్ రహమాన్ ,ఖాదర్‌బాషా, షౌకత్‌అలి, జహంగీర్, మొహమ్మద్ బాష ,మోసిన్ ఆఫీజ్ కుద్దుస్, హఫీజ్ అబ్దుల్లా ,హాఫీజ్ మునవర్ అబ్దుల్ రెహమాన్, ఆఫీస్ షానవాజ్, నూరళ్ళఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

బీమా చట్టాల సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం

- ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం తగదు
- రిక్రూట్‌మెంట్,జిఎస్‌టి తగ్గింపు, పాతపెన్షన్ విధానం డిమాండ్లను పరిష్కరించాలి
- 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కర్నూలు శాఖ కార్యదర్శి సునీయ కుమార్ పిలుపునిచ్చారు. అధ్యక్షులు అవధానం మాక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారన్నారు. దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎల్ఐసిలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమం మరోమారు చేపట్టనున్నదని, దీనిని ప్రతిఘటిస్తున్నామని అన్నారు. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించాలని ఆయన కోరారు. 3,4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్మెంట్ తక్షణం చేపట్టాలన్నారు. దేశంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాతపెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని, ఎల్ఐసి లో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏజెన్సీ యూనియన్ సెక్రటరీ గజేంద్రరెడ్డి డెవలప్మెంట్ యూనియన్ నేతలు రమేశ్ , కర్నూలు బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రమేష్, మహిళా కార్యదర్శి అంబుజా సింగ్ , ఉస్మాన్ ఘని, ఉస్మాన్, షేకున్‌బీ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో ఎల్ఐసి సంఘం బ్రాంచి కార్యదర్శి సునీయ కుమార్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'మద్యం' యజమానులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులను నిర్వహిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నగర న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష అన్నారు. మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. మద్యం షాపుల వద్ద బహిరంగంగా మద్యపానం నిషేధం ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది మద్యం షాపు యజమానులు షాపులకు అనుబంధంగా రూమ్ లోనే ఏర్పాటు చేశారన్నారు. దానికి తోడు మద్యం షాపుల వద్దని బహిరంగంగా మద్యాన్ని సేవించడాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అలాంటి యజమాన్యాలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యా భవిష్యత్తు కోసం ఎన్‌లైటన్ ఉత్తమ ఎంపిక

-ఇంటర్, డిగ్రీ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశం
- భవిష్యత్తు నిర్మాణానికి బలమైన పునాది
- డైరెక్టర్ నజీర్ అహమ్మద్

Enlighten group of institutions — Innovative Skills / Innovative Thoughts — Since2009

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థుల మెరుగైన భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకుని నాణ్యమైన విద్యను అందించడంలో ప్రత్యేక విద్యా కేంద్రంగా ఎన్‌లైటన్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థలు ప్రారంభించామని డైరెక్టర్ నజీర్ అహమ్మద్ ప్రజాశక్తితో తెలిపారు. మద్దూర్ నగర్‌లో ఇంటర్మీడియట్, బిర్లాగేట్ ఆర్‌సిలో డిగ్రీ, ఉలిందకొండ రోడ్డులో వ్యవసాయ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయన్నారు. సాధారణ విద్యతోపాటు పోటీ పరీక్షల శిక్షణ, సాంకేతిక విద్య, వ్యవసాయ శాస్త్రం వంటి విభాగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలను కూడా అందిస్తుదన్నారు.

ఇంటర్ స్థాయిలో: ఎంపిపి, బైపిసి, ఎంఇసి,సిఇసి, హెచ్‌ఇసి గ్రూపులతో పాటు జెఇఇ, నీట్, ఇఎపిసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

డిగ్రీలో : బిఎస్‌సి (కంప్యూటర్ సైన్స్), బిసిఎ (డిజిటల్ మార్కెటింగ్), బికాం (కంప్యూటర్ అప్లికేషన్), బిఎస్‌సి , బిజడ్‌సి వంటి డిగ్రీ కోర్సులు వీటితో పాటు ఎన్‌లైటన్ గ్రూప్ ఆధ్వర్యంలో 'ఎన్‌లైటన్ ఐఎఎస్ అకాడమీ' ద్వారా బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బి గ్రూప్స్, వంటి అన్ని పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత విద్యా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన వారికి 100 శాతం విద్యా సహాయం (స్కాలర్‌షిప్) అందిస్తామన్నారు.

అగ్రికల్చర్ కోర్సుల్లో : వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యంలో బిఎస్‌సి (గౌరవ) వ్యవసాయ శాస్త్రం, వ్యవసాయ డిప్లొమా, పశువైద్య శాస్త్రం, ఎంఎస్‌సి వ్యవసాయ శాస్త్రం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు 72076 66218 లేదా 96183 82660 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని సంగాల హైస్కూల్ లో పని చేస్తున్న బాల తిమ్మారెడ్డి గోవింద్, సురేష్ రాజు, రాముడు, రామలింగేశ్వర య్యలు ఇటీవల బదిలీ అయ్యారు. గ్రామ పెద్దలు హనుమంతు యాదవ్, నాగన్న హెచ్‌ఎం సునీల్ రాజు తదితరులు చైర్మన్ వెంకటేష్ సమక్షంలో బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. ఈ పాఠశాల స్థాయిని పెంచి విద్యార్థులను తీర్చి దిద్దుటలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. భవిష్యత్తులో గురువులు ఆరోగ్యాంగా ఉండాలని వీడ్కోలు పలికి నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.

పారిశుధ్యం ఆధారంగా ర్యాంకింగ్

గ్రామాలపై చర్యలకు జడ్‌పి సిఇఒ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సమీక్షలో మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ (ఎస్‌బిఎం-జి) కింద జిల్లాలు, రాష్ట్రాల పారిశుధ్యం , పరిశుభ్రత పనితీరు ఆధారంగా అంచనా వేయడానికి, ర్యాంక్ ఇవ్వడానికి తాగునీరు, పారిశుధ్య విభాగం డిడిడబ్ల్యుఎస్ ,క్రమం తప్పకుండా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జి)ను నిర్వహిస్తుందని(ఎన్‌జెజెఎం అండ్ ఎస్‌బిఎం) అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌జి కేవలం ర్యాంకింగ్ వ్యాయామం కంటే ఎక్కువగా అభివృద్ధి చెందింది ఇది జన్ ఆందోళన్ (ప్రజల ఉద్యమం) ను రూపొందించడానికి, విస్తృత సమాజ నిశ్చితార్థాన్ని నడిపించడానికి , కీలక మిషన్ లక్ష్యాలను సకాలంలో, సమర్థవంతంగా అమలు చేయడానికి ఒక శక్తివంతమైన సాధనంగా మారిందన్నారు. తాగునీరు, పారిశుధ్య విభాగం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025ను ప్రారంభించిందన్నారు. దీనిని అకాడమీ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ అనే స్వతంత్ర సంస్థ నిర్వహిస్తుందన్నారు. పారిశుధ్యం పరిమాణాత్మక , గుణాత్మక పారామీటర్ (స్వచ్ఛత) రెండింటి ఆధారంగా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు , జిల్లాలకు జాతీయ ర్యాంకింగ్ ను అందించడం ఈ సర్వే లక్ష్యమన్నారు. అందులో భాగంగా కర్నూలు జిల్లా స్థాయి లో జిల్లా అధికారులు సిఇఒ, జిల్లా పరిషత్, పర్యవేక్షక ఇంజినీరు, గ్రామీణ నీటి సరఫరా , జిల్లా పంచాయతీ అధికారి, కర్నూలు డిఎల్‌డిఒ పత్తికొండ కన్సల్టెంట్స్ జిల్లా స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 మీద అవగాహనా విషయమై, మండల పరిషత్ అధికారులకు, డిప్యూటీ మండల పరిషత్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు మండల కోఆర్డినేటర్లకు ఫీల్డ్ సర్వే మీద అవగాహన కల్పించామన్నారు. ఈ అవగాహన లో జిల్లా పరిషత్ సిఇఓ నాసరరెడ్డి, అర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, పంచాయితీ అధికారి భాస్కర్,పాల్గొని కిందిస్థాయి అధికారులకు అవగాహన కల్పించారు.

పండ్ల తోటలు సాగుకు మూడేళ్ల రాయితీ

ప్రజాశక్తి-మద్దికేర

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద, చిన్న సన్నకారు రైతుల పంటలకు సాగు చేస్తే, మూడేళ్ల వరకు రైతులు అందిస్తామని ప్లాంటేషన్ సూపర్వైజర్ రత్నం అన్నారు. మండల పరిధిలోని భోజనేనిపేట, గ్రామంలో పండ్ల తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలో కర్షకుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100శాతం సబ్సిడితో పండ్ల తోటల అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఇందులో ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతుల స్థిరాస్తిని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతులను ఇందుకు అర్హులుగా ప్రకటించిందన్నారు. 100 శాతం సబ్సిడీతో గులాబీ తోట, మల్లె పూల తోటతో సహా 17 రకాల (మామిడి పండ్లు , బత్తాయి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, బెర్‌ఆపిల్ (రేగు పండ్లు), డ్రాగన్ ఫ్రూట్, అంజూర పంట, మునగ తదితర) మాట్లాడుతూ మూడేళ్ళ పండ్ల తోటకు మామిడి 70 మొక్కలకు గాను రూ.99,911 వేలు,చీని 100 మొక్కలకు రూ.1,26,702, నిమ్మకాయల తోటకు110 మొక్కలకు రూ.1,33,911 ,జామ 110 మొక్కలకు రూ.1,35,288, థైవాన్ జామ పండ్ల తోటకు 444 మొక్కలకు రూ.2,25,560, సీతాఫలం 240 మొక్కలకు రూ.1,90,114, దానిమ్మ పండ్ల తోటకు 267 మొక్కలకు రూ.1,96,019 ,బెర్ ఆపిల్ (రేగు పండ్లు)320 మొక్కలకు రూ.1,14,329 చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, ఎపిఒ నర్సిరెడ్డి టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్, రైతులు ఉపాధి వేతన దారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పు: ఎఇ రఫీక్ ఖాన్



వ్యవసాయానికి పది రోజులు పాటు త్రిఫేస్ విద్యుత్ సరఫరా మార్పు చేసినట్లు మండల విద్యుత్ శాఖ అధికారి రఫీక్ ఖాన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయంలో ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు మధ్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు ఉన్న త్రీఫేస్ విద్యుత్తును నంచర్ల, పెరవలి, కొత్తపల్లి, లీడర్లలో నేటి నుంచి ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పది రోజులు పాటు మార్పు చేసినట్లు తెలిపారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పనుల కారణంగా వ్యవసాయంలో విద్యుత్ సరఫరా సమయం మార్చినట్లు తెలిపారు. వ్యవసాయదారులు రైతులు వినియోగదారులు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

అంతర పంటల సాగుతో ఆదాయాన్ని మెరుగుపరుచుకోవాలని కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ రైతులకు సూచించారు.పాలకుర్తి గ్రామంలో పత్తి రైతులతో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ప్రతి పంటను పరిశీలించి పంట ఎదుగుదల తక్కువగా ఉన్నందువల్ల నానో యూరియా 500 మిల్లీమీటర్లు ఎకరానికి , నానో డిఎపి ఎకరానికి 500 మిల్లీలీటర్ల పైపాటిగా స్ప్రే చేసుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు. ప్రతి పంటలో ఎక్కడైనా దోమ, రసం పీల్చే పురుగు ,ఉన్న యెడల వేప నూనెను పిచికారి చేసుకోవలసిందిగా వెల్లడించారు. పంట పొలంలో , గట్లకు పిచ్చి మొక్కలు గడ్డి లేకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. ప్రతి పంట చుట్టూ జొన్న పంటను రక్షక పంటగా వేసు కోవాలని తెలిపారు. గ్రామంలో కంది పంటని పరిశీలించామని, కంది పంటలో సజ్జను, చెవుల కాయ పంటను అంతర్పంటగా రైతులు సాగు చేశామన్నారు. దీని ద్వారా రైతుకు అదనపు ఆదాయం వస్తూ భూమి సారవంతం పెరుగనుందన్నారు. వెంకటేశ్వర రెడ్డి, మోదిన్ సాహెబ్ ,రామాంజనేయులు, కాసింబాష, ఆర్ఎస్‌కె సిబ్బంది, హనీఫ్ బాష, సుకన్య, రఫీ, రైతులు పాల్గొన్నారు.

చైర్మన్ రేసులో తలారి రంగప్ప

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ రేస్‌లో తలారి రంగప్ప పేరు టిడిపి వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తుంది. టిడిపి ఆవిర్భావ నుంచి పార్టీలో ఉంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తున్నారు. కెఇ కృష్ణమూర్తి కుటుంబానికి విధేయులుగా పనిచేస్తున్నారు. పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన తలారి రంగప్ప వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు అభిమానంతో రాజకీయాల్లోకి ప్రవే శించారు. కెఇ కుటుంబంలో ఎమ్మెల్యే ,ఎంపీ విజయం కోసం ఎంతో కృషి చేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ తరపున 2009 కెఇ ప్రభాకర్, 2014 కెఇ కృష్ణమూర్తి, 2019 కెఇ శ్యామ్ కుమార్,2024 కెఇ శ్యామ్ కుమార్ ఎమ్మెల్యేలుగా పోటీ చేసినప్పుడు చందోలి గ్రామం నుండి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తున్నారు. చందోలి రంగప్ప తన కుటుంబంలో సర్పంచి, ఎంపిటిసి గెలిపించుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో 2021 స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలలో టిగడిపి తరపున చందోలి గ్రామ సర్పంచిగా సరోజమ్మను, ఎంపిటిసిగా లక్ష్మిలను గెలిపించుకున్నారు. కేఈ కుటుంబానికి, పుచ్చకాయలమాడ టిడిపి సాంబశివ రెడ్డి కుటుంబానికి ఎంతో ఆత్మీయుడుగా ఉంటున్నారు. సొసైటీ చైర్మన్‌గా తలారి రంగప్ప పేరు రాజకీయ పార్టీ శ్రేణుల్లో జోరుగా వినిపిస్తుంది.

టిడిపికి ఎదురుగాలి..!

- పార్టీకి గురురాజ్ దేశాయ్, పలువురి రాజీనామా

ప్రజాశక్తి - నందవరం

మాట్లాడుతున్న గురురాజ్ దేశాయ్

నందవరం గ్రామంలో టిడిపికి ఎదురుగాలి వీస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా గ్రామంలో మాత్రం టిడిపి ముఖ్య నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. నందవరం గ్రామంలో టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తిగత కారణాల వల్ల టిడిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత 30 ఏళ్లుగా టిడిపికి తమ కుటుంబం సేవలందించినట్లు తెలిపారు. తానూ టిడిపిలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. పార్టీ తరపున, తాను స్థాపించిన దేశాయ్ యూత్ అసోసియేషన్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పార్టీ కూడా తమను గుర్తించిందని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి, ఎల్ఎల్‌సి ఛైర్మన్ రామన్న గౌడ్ కూడా టిడిపికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌టి.రామారావు టిడిపిని స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాయ్ కుటుంబం ఆధ్వర్యంలో పార్టీలో ఉన్నానని తెలిపారు. రామారావు సంతకం చేసిన సభ్యత్వం కార్డు తన దగ్గర ఇప్పటికీ భద్రంగా ఉందని చెప్పారు. సర్పంచిగా 5 ఏళ్లు పని చేసినట్లు తెలిపారు. తమ నాయకులు గురురాజ్ దేశాయ్ అడుగుజాడల్లోనే నడుస్తూ పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆయన వెంటే ఉంటానని తెలిపారు. దేశాయ్ యూత్ అధ్యక్షులు సాధిక్, కల్లెల్ శివ, హనుమన్న, దానియేల్, ఖాసీం, ఆది ఆంధ్ర స్కూల్ ఛైర్మన్ శివ, అబ్దుల్, గని, మిన్నెల్లా, చాకలి ఉరుకుంద రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పోస్టు ద్వారా టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డికి పంపినట్లు గురురాజ్ దేశాయ్ తెలిపారు.

నీటిని వృథా చేయవద్దు : ఛైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న ఛైర్మన్ లోకేశ్వరి

నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటే సమస్య నుంచి బయట పడవచ్చని మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వైస్ ఛైర్మన్ నరసింహులు, డిఇ గోపీనాథ్‌తో కలిసి రాంజల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బసాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిల్వ తక్కువ ఉందని, అడుగంటిన నీరు కుళాయిల ద్వారా వస్తోందని తెలిపారు. నేరుగా తాగకుండా వేడి చేసి చల్లార్చిన తర్వాతనే తాగాలని సూచించారు. నీటి కొరతపై మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆదోనిలో కేవలం 40 రోజులకు సరిపడే తాగునీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ప్రజలు నీటిని అత్యవసరానికి మాత్రమే వినియోగించాలని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి బాధ్యతాయుతంగా ప్రవర్తించి నీటి రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. రాంజల చెరువులో చేపలు పెంచడం సమంజసం కాదన్నారు. చికెన్ వ్యర్థాలు వేసి నీటిని కాలుష్యం చేస్తున్నారని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, అశోక్, ఉస్మాన్, బాలాజీ, మమ్ముట్టి స్వామి, వసీం, కిషోర్, నాయకులు నాగరాజ్, గోవిందు, రహీమాన్ ఉన్నారు.

మాట నిలబెట్టుకున్న సర్పంచి

ప్రజాశక్తి - కౌతాళం

పైపులైన్ పనులు చేయిస్తున్న సర్పంచి పాల్ దినకరన్

కౌతాళంలోని అత్తర్ వీధి ప్రజల తాగునీటి సమస్యను సర్పంచి పాల్ దినకరన్ పరిష్కరించారు. ఈ కాలనీ ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సర్పంచి పాల్ దినకరన్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం తమ సిబ్బందితో సమస్య ఎక్కడ ఏర్పడిందో గుర్తించి వెంటనే పైపులైన్ మరమ్మతు పనులు చేయించారు. ఒక్క రోజులోనే సమస్యను పరిష్కరించి కాలనీ ప్రజలకు అందించినట్లు వారు తెలిపారు.

'అర్హులకు ప్రమోషన్లు కల్పించాలి'

ప్రజాశక్తి - నందవరం

అర్హులకు ప్రమోషన్లు కల్పించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ కృష్ణమూర్తి, రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించాలని కోరారు. శేఖర్, రవిచంద్ర, గోవిందు, రాములమ్మ, రాఘవేంద్ర, మల్లికార్జున గౌడ్, కొండన్న, రాధా, భారతి, కొండన్న, చంద్ర పాల్గొన్నారు.

కుళ్లిన గుడ్లు.. నీళ్ల చారు..!

- అరకొరగా అన్నం
- ఇది మధ్యాహ్న భోజనం పరిస్థితి
- ఆకలితో అలుమటిస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా పథకం సాగుతోంది. పర్యవేక్షణ లోపం, అధికారులు పట్టించుకోకపోవడంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు కుళ్లిన కోడి గుడ్లతో, నీళ్లచారు పోస్తూ భోజనం పెడుతున్న నిర్వాహకులపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...

మండలంలోని వందవాగిలి గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం మాత్రం 150 మంది విద్యార్థులు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మాత్రం విద్యార్థులకు సరిపడినంత ఆహారం తయారు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వాపోతున్నారు. 180 మందికి గాను కేవలం 75 మంది విద్యార్థులకు సరిపడినంత భోజనాలు తయారు చేయడంపై మండిపడుతున్నారు. అలాగే మెనూ పాటించడం లేదని విమర్శిస్తున్నారు. మంగళవారం పులగం రైస్, ఉడికించిన కోడి గుడ్డుతో టమోటా కర్రీ పెట్టాల్సి ఉండగా, ఉడికీ ఉడకని కలర్ రైస్, టమోటా కర్రీకి బదులుగా నీళ్ల చారులో ఉడకని, కుళ్లిన కోడి గుడ్లు వేసి భోజనం పెట్టారు. ఆ భోజనాన్ని కొందరు విద్యార్థులు తినగా మిగతా విద్యార్థులు పాఠశాల ఆవరణంలో పడేశారు. కుక్కలు, పందులు పోటీ పడి తింటున్నాయి. రుచి, శుచి లేకుండా వంట చేయడంపై ప్రజాశక్తి విలేకరి ప్రశ్నించగా... కూరగాయలు తీసుకురాలేదని, అందుకే కలర్ రైస్, నీళ్ల చారు చేశామని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలి కదా అని చెప్పగా.. 'పిల్లలకు ఏదో ఒక్కటి వడ్డించాం కదా' అంటూ వంట నిర్వాహకులు నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.

ఏం రాస్తారో రాసుకోండి

- ప్రధానోపాధ్యాయులు జంబునాథ్

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు వెళ్లిన విలేకరిపై ప్రధానోపాధ్యాయులు జంబునాథ్ 'ఏం రాస్తారో రాసుకోండి' అంటూ బెదిరింపు ధోరణితో కేకలు వేశారు. 'రోజూ భోజనం బాగుంటుంది. ఈరోజు ఇలా అయింది.

పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

చెప్పితే వినాలి. లేకుంటే మీ ఇష్టం' అంటూ వంట నిర్వాహకులకు వత్తాసు పలకడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకైతే ఇలా...

పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా కారం కలిపిన గుడ్లు, అన్నం, రసాన్ని వంట మనుషులు ముందుగానే తీసి పక్కన పెట్టారు. అంటే పిల్లలు ఎలాగైనా తినొచ్చు. పిల్లలు బాగోగులు మాకేం అవసరం లేదు. మనం దర్జాగా భోంచేశామా అన్నట్లు వ్యవహరిస్తున్నారు ఉపాధ్యాయులు. నాణ్యమైన భోజనంతోపాటు గుడ్లు అందించేలా మధ్యాహ్న భోజనం ఏజెన్సీలపై ఒత్తిడి తేకపోవడమే కాకుండా అన్ని బాగున్నాయి అంటూ వారికి వత్తాసు పలకడం చూస్తుంటే వారికి మధ్యాహ్న భోజనంలో వాటా ఎంత ఉందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

డిజిటలైజేషన్‌తో పారదర్శక సేవలు

- లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే
- నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

డిజిటలైజేషన్‌తో రైతులకు పారదర్శక సేవలందించవచ్చని నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ డిపిడిఎం నాహిదా సుల్తాన, డిసిఒ వెంకటకృష్ణ, డిసిసిబి సిఇఒ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని గోనెగండ్ల, హెచ్.కైరవాడి వ్యవసాయ సహకార సొసైటీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వ్యవసాయ సహకార సంఘాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా ఉన్న 99 వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) పూర్తయిందని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో మార్పులు వచ్చి అనేక బ్యాంకులు విలీనం అయినా సహకార వ్యవస్థ మాత్రం నూతన మార్పులతో ఆధునికీకరించి శాశ్వతంగా అలానే కొనసాగుతుందని చెప్పారు. సొసైటీలకు ఆయా సంఘాల సభ్యులే కీలకమని తెలిపారు. సభ్యులు, పాలకవర్గం, సిబ్బందితో సమన్వయం చేసుకొని సమావేశాల్లో తగిన నిర్ణయాలు తీసుకొని రుణాలు తీసుకోవడంతో పాటు రుణాల చెల్లింపుల్లో కూడా సహకరించి సొసైటీల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అప్పులు పొందిన రైతులు తిరిగి చెల్లించేటప్పుడు సొసైటీల్లో కంప్యూటర్ సిస్టం జనరేట్ చేసిన రసీదును పొంది సంఘ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సంతకం, సీలు ఉండే రసీదును మాత్రమే తీసుకోవాలన్నారు. మాన్యువల్‌గా జారీ చేసిన రసీదులు చెల్లవని అన్నారు.

మాట్లాడుతున్న డిసిసిబి సిఇఒ

సీనియర్ సిటిజన్లకు ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు

తమ సహకార బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్లకు ఆకర్షణీయమైన వడ్డీతో కూడిన 333 రోజుల వ్యవధితో సింధూర్ డిపాజిట్ పథకం ప్రవేశపెట్టామని తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారికి 7.06 శాతం, 60 ఏళ్లలోపు వారికి 6.54 శాతం వడ్డీ లభించనుందని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోడుమూరు బ్యాంకు మేనేజర్ సి.అయ్యస్వామి, సూపర్‌వైజర్ విక్రమసింహారెడ్డి, కైరవాడి సిఇఒ గోపాల్ రెడ్డి, గోనెగండ్ల సిఇఒ చంద్రశేఖర్, సిబ్బంది మునిస్వామి, ప్రకాష్ రెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

ఆంధ్ర సరిహద్దుల్లో ఉన్న ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ఇసుకాసురులు

-ఇసుకను అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక వాసులు

ప్రజాశక్తి - కోసిగి

తుంగభద్ర నదిలో ఇసుకాసురులు పడ్డారు. మండలంలోని అగసనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఆంధ్ర వైపు ఉన్న సరిహద్దుల్లో కర్ణాటక రాష్ట్రం తమాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అగసనూరు గ్రామానికి చెందిన వ్యక్తులు ఇలా అక్రమంగా ఇసుక తరలిస్తే రాబోయే తరానికి ఇసుక అనేది ఉండకుండా పోతుందని, ఇసుక అక్రమార్కులను ఆపడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ తుంగభద్ర నది గూండా వందలాది ఇసుక ట్రాక్టర్లతో కర్ణాటక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఇలా అడ్డుకున్న వ్యక్తులపై కర్ణాటక వాసులు దాడులు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇసుక అక్రమ తరలింపును అధికారులు అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆంధ్ర సరిహద్దుల్లో ఇలా అక్రమంగా ఇసుక తరలించిన కర్ణాటక వాసులపై చర్యలు తీసుకుని.. బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పత్తి పొలం ధ్వంసం

- పోలీసు స్టేసన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం నగరడోన పంచాయతీ పరిధిలో పత్తి విత్తిన పొలాన్ని దుండగులు ధ్వంసం చేశారు. బాధితులు సునీత మంగళవారం పోలీసు స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు... సర్వేనెంబర్ 384లో 4.97 ఎకరాల పొలంలో నాటిన పత్తి విత్తనాలు, ఈనెల 5న మండల సర్వేయర్ సర్వే చేసి వేసిన హద్దు రాళ్లను తన చిన్నాన్న లక్ష్మిరెడ్డి, అతని కొడుకులు రఘునాథ్ రెడ్డి ట్రాక్టర్‌తో సునీత పొలంలోకి అక్రమంగా ప్రవేశించి తొలగించారు. పత్తి పంటను ట్రాక్టర్‌తో దున్నేశారు. సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు.

'పిలుస్తున్నా'.. రావడం లేదు..!

- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'
- హాజరుకాని అనుబంధ శాఖల అధికారులు
- 'మమ' అనిపిస్తున్న వ్యవసాయ శాఖ

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి అనుబంధ శాఖల అధికారులు రావడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు నామమాత్రంగా నిర్వహిస్తూ 'మమ' అనిపిస్తున్నారు. వ్యవసాయ సాగులో రైతులను సుశిక్షితులను చేసి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. ఈ సంకల్పంతో చేపడుతున్న 'పొలం పిలుస్తోంది' మొక్కుబడిగా సాగుతోంది. వ్యవసాయ శాఖాధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా రైతుల వద్దకు వెళ్లి సూచనలు ఇవ్వాలి. రైతు చెప్పిన సమస్యలు వినాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగు, తెగుళ్ల నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై రైతులతో చర్చించి అవగాహన కల్పించాలి. ఇదేదీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వ్యవసాయ శాఖాధికారులు మినహా మిగిలిన శాఖల అధికారులు కనిపించడం లేదు. మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించాలి. పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాలి.

ముందస్తు సమాచారం లేక వెలవెల

ఏరోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు. రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని 'మమ' అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తనం నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చాలామందికి అవగాహన భ్రమగానే మారింది. వాస్తవానికి 'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు హార్టికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, విద్యుత్, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వీరితో పాటు రైతు మిత్రసంఘాలు, భూసంరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబర్ 24 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయింది.

నలుగురితోనే 'పొలం పిలుస్తోంది'

షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం మండలంలోని దిబ్బనకల్, బసరుకోడు గ్రామంలో 'పొలం పిలిస్తోంది' నిర్వహించారు. ఎఇఒ సతీష్, ఎంఎఇఒ సౌమ్య, ఎంపిఇఒ సుమిత్రతో పాటు నలుగురు రైతులతో కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులంతా డుమ్మా కొట్టారు.

అధికారులంతా హాజరుకావాలి : బాలవర్ధిరాజు ఎడిఎ, ఆదోని

'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయశాఖ అధికారులతో పాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. ఆయా శాఖల పథకాలను తెలియజేసి రైతు సమస్యలను పరిష్కరించాలి. కార్యక్రమం షెడ్యూల్‌ను అందరికీ పంపుతున్నాం.

పొలం పిలుస్తుంది'లో వ్యవసాయ శాఖ అధికారులు

వ్యవసాయాభివృద్ధికి ముందుకు

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలో వ్యవసాయ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు, కోఆపరేటివ్ సొసైటీల అభివృద్ధి, సమస్యలపై చర్చించారు.

మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడుతున్న బీవీ

కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు

- ఈనెల 28న ఆస్పత్రి ప్రారంభం
- ఆర్థోపెడిక్ డాక్టర్ రఘు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ఎముకలు, కీళ్లు, వెన్నెముక వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని ఆర్థోపెడిక్ డాక్టర్ రఘు తెలిపారు. మంగళవారం ఆయన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28న పట్టణంలోని భీమాస్ సమీపంలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఆర్థో స్పైన్ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సామాన్యులకు సైతం వెన్నెముక, కీళ్ల మార్పిడి, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. గతంలో కర్నూలు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఆపరేషన్లు చేయించుకునే వారని, అలాంటి ఇబ్బంది లేకుండా ఆదోనిలోనే అందుబాటులో సేవలు తెస్తున్నామని తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రఘు

అందుబాటులో ఉన్న సేవలు

వెన్నెముక శస్త్రచికిత్స, మినిమల్లీ ఇన్వాసివ్ వెన్నెముక శస్త్రచికిత్స, ఎండోస్కోపిక్ వెన్నెముక శస్త్రచికిత్స, కీళ్ల మార్పిడి, స్పోర్ట్స్ మెడిసిన్, అత్యవసర ట్రామా కేర్, ఫిజియోథెరపీ, పూర్తిగా అమర్చబడిన ప్రయోగశాల, ఇసిజి, డిజిటల్ ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తన పర్యవేక్షణలో ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్‌లో ఆర్థోపెడిక్ సర్జన్ విజయవంతమయ్యాయని చెప్పారు. 15 సంవత్సరాల అనుభవం, 15 వేల విజయవంతమైన శస్త్రచికిత్సలు, 100 కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయని వివరించారు.

విద్యార్థుల అర్ధాకలి

- స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థుల కడుపు మాడుస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా భోజనం తయారు చేయాల్సిన ఏజెన్సీ నిర్వాహకులు లాభాల కోసం ఆశపడి చిన్నారులను అర్ధాకలితో వదిలేస్తున్నారు. దగ్గరుండి సమస్య రాకుండా చూడాల్సిన ప్రధానోపాధ్యాయులు ఫయాజ్ ఏజెన్సీ నిర్వాహకులకే వత్తాసు పలకడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 1,175 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కొక్కరికి 150 గ్రాముల చొప్పున బియ్యంతో భోజనం చేయాల్సి ఉంది. అందులో కూడా కక్కుర్తి పడి కేవలం 120 కిలోలతో భోజనం చేయడంతో సరిపోక విద్యార్థులు ప్లేట్లతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సోమవారం 990 మంది విద్యార్థులకు గాను 770 మందికి సరిపడ భోజనం తయారు చేశారు. విద్యార్థులు తినకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు భోజనం లేక చదువుకోలేక ఇబ్బందులు పడ్డారు. మంగళవారం కూడా పరిస్థితి యథావిధంగా కొనసాగడంతో ఏజెన్సీ నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, మహ్మద్ గౌస్ స్కూల్‌కు వెళ్లి సమస్య గురించి ఆరా తీశారు. సరైన సమాధానం రాకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మరోసారి సమస్య రాకుండా చూస్తామని ఉపాధ్యాయులు చెప్పడంతో వారు వెనుదిరిగారు. ఘటన గురించి సాయంత్రం మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, తహశీల్దార్ రమేష్ పాఠశాలకు వెళ్లి బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. పొంతన లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఫయాజ్‌తో పూర్తి సమాచారం రాయించుకున్నారు. తలుపులు మూసి రిపోర్టు తయారు చేయడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

వివరాలపై ఆరా తీస్తున్న తహశీల్దార్ రమేష్, కమిషనర్ కృష్ణ

రూ.5 కోట్లు దాటిన హుండీ ఆదాయం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.5 కోట్లు దాటింది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కించారు. మంగళవారం శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు వివరాల మేరకు... మే చివరి వారం నుంచి ఈనెల 24 వరకు 35 రోజుల హుండీ ఆదాయం లెక్కించారు. నగదు రూపంలో రూ.5,13,04,958 రాగా, నాణేల రూపంలో రూ.15,34,580, బంగారం 43 గ్రాములు, వెండి 1 కిలో 837 గ్రాములు వచ్చింది.

కార్మికుల ఆందోళన తీవ్రతరం

ప్రజాశక్తి - ఆదోని

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ఆందోళనను తీవ్రతరం చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నారు. ఆదోనిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారం 22వ రోజుకు చేరింది. మున్సిపల్ ప్రధాన రోడ్డులో మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. శిబిరానికి ఐఎఫ్‌టియు నాయకులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి జి.వెంకప్ప సంఘీభావం తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పీరా సాహెబ్, సోమన్న, అహ్మద్, వీరేష్, చంటి, కర్రెప్ప, శివరాం, కరీముల్లా ఎలక్ట్రీషియన్ బాష, ప్రవీణ్, మోహిన్, ఎం.కుమార్, ఎలక్ట్రీషియన్ ఈరన్న, ఎలక్ట్రీషియన్ దాదు, వల్లప్ప, ఆంజనేయులు, ఐసి.వీరేష్ ఉన్నారు.

వికలాంగులకు అడ్మిషన్లు ఇవ్వాలి

- డిఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఇంటర్మీడియట్‌లో వికలాంగులకు అడ్మిషన్లు ఇవ్వాలని వికలాంగుల సాధికారత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బీసీ.నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన మానసిక (ఎంఆర్) వికలాంగ విద్యార్థులకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చేరేందుకు ప్రిన్సిపల్ ప్రసాద్‌ను సంప్రదించినట్లు తెలిపారు. 'నేను ఇలాంటి మానసిక పిల్లలను నా కాలేజీలో చేర్చుకోను' అని అడ్మిషన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల జూనియర్ కళాశాలలో మానసిక వికలాంగ విద్యార్థినులకు అడ్మిషన్లు ఇచ్చారని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు స్పందించి అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు.

నంచర్లలో వైభవంగా సుంకులమ్మ, లింగమయ్యల దేవర

- ప్రముఖులకు స్వాగతం పలికిన టిడిపి నాయకులు శివలింగ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నంచర్ల గ్రామంలో సుంకులమ్మ, లింగమయ్యల దేవరను టిడిపి మాజీ ఎంపీటీసీ, టిడిపి సీనియర్ నాయకులు శివలింగ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాయకులతో పాటు నియోజకవర్గంలోని రాజకీయ ప్రముఖులు, అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ దేవరను తిలకించడానికి పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆస్పరి సిఐ మస్తాన్ వలీ, ఆలూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, మాజీ జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, ఆలూరు బ్రాంచి కెనాల్ డిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప, మాజీ ఎంపిపిలు భీమ లింగప్ప చౌదరి, ఆలూరు దేవేంద్రప్ప, ఏరూరు హరి హాజరయ్యారు. వీరికి మాజీ ఎంపిటిసి శివలింగ, సోదరుడు కానిస్టేబుల్ లేపాక్షి స్వాగతం పలికి, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి.. పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం డీఎస్పీ వెంకటరామయ్య లింగమయ్య, సుంకులమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీలకతీతంగా వైసిపి, టిడిపి నాయకులు హాజరై ఒకరికొకరు కరచాలనం చేసుకొని పలకరించుకున్నారు. మాజీ ఎంపిటిసి శివలింగ మాట్లాడుతూ... తాను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన దేవరకు హాజరైన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్పంచులు కొండా పురుషోత్తం, సురేష్, తిమ్మయ్య, విఆర్‌లు పెద్దన్న, కరెంటు సత్తన్న, బాలగోపాల్, మాజీ ఎంపిటిసి సంజీవ రాయుడు, దళిత నాయకులు తిమ్మప్ప, పోతురాజు రాముడు, మాజీ పంచాయతీ కార్యదర్శి నెట్టప్ప, నంచర్ల పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్, జాకీర్ పాల్గొన్నారు.

డీఎస్పీ వెంకటరామయ్య, మల్లికార్జున చౌదరిని సన్మానిస్తున్న శివలింగ

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఇఒలు

ప్రభుత్వం నుంచి మంజూరైన ట్రై సైకిళ్లను, ఇతర పరికరాలను ఎంఇఒలు మొహినుద్దీన్, రాఘన్నలు వికలాంగులకు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో రొలెటర్లు 5, సిపివీల్ చైర్లు 2, ట్రై సైకిల్ 1, మోటార్ ట్రై సైకిల్ 1, వినికిడి యంత్రాలు 2, చేతి కర్రలు 2 వికలాంగ విద్యార్థులకు అందజేశారు. భవిత కేంద్రం ఐఆర్‌టి కల్యాణి, శివప్రసాద్, సిఆర్‌పి నరసన్న గౌడ్, భీమేష్, బంగారప్ప, ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, నాగేంద్ర, రామ్మోహన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రుచికరమైన భోజనమందించాలి : విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన భోజనం అందించాలని ఎంఇఒలు మొహినుద్దీన్, రాఘన్నలు వంట ఏజెన్సీ నిర్వాహకులు మేకల నరసింహకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల పీడీ రవీంద్ర, సిఆర్‌పి బంగారప్ప పాల్గొన్నారు.

దళితుల ప్రాణాలతో చెలగాటం

- సింగయ్య మృతికి జగనే కారణం - టిడిపి నేత కదిరికోట ఆదెన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా దళితుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, సింగమయ్య మృతికి జగనే కారణమని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. 2019లో అధికారం చేపట్టిన తర్వాత తొలి ఏడాదిలో దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి మరణానికి కారణమయ్యారని, ఫలితంగానే 2024లో అధికారం కోల్పోయారని తెలిపారు. పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో జగన్ కారు కిందపడి దళితుడైన సింగయ్య మృతి చెందారని చెప్పారు. కారు టైర్ కింద సొంత పార్టీ కార్యకర్త పడి నలిగిపోతుంటే కారు ఆపకుండా ముళ్ల పొదల్లోకి ఈడ్చి పడేయించిన జగన్‌లో మానవత్వం లోపించిందని మండిపడ్డారు. సింగయ్య మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి - కోసిగి


ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపిపి

కోసిగి ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ నంద్యాల జిల్లా ప్యాపిలి మండలానికి బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లును ఎంపిపి లవకుశ ఈరన్న, వైసిపి నాయకులు మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఒ వెంకటేశ్వర్లుకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఎంపిపి లవకుశ ఈరన్న మాట్లాడుతూ... ఎంపిడిఒ వెంకటేశ్వర్లు మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. వైసిపి నాయకులు జంపాపురం బసిరెడ్డి, లోకరెడ్డి, నేలకోసిగి లక్ష్మన్న పాల్గొన్నారు.